# ప్రేమలేఖ

## చంద్రం



జవాను ఏడుకొండలు ఓ అర్జెంటు ఫైలు తెచ్చి అయ్యగారి టేబుల్‌మీద పెట్టి వెళ్ళాడు.

కళ్ళద్దాలు సవరించుకొని, యధాలాపంగా ఫైలు తెరిచిన ఆఫీసర్ శివానందం దృష్టిని, ఓ కాగితం మడత ఆకర్షించింది. మడిచి వుండటాన ఆ కాగితం ఫైలుకు సంబంధించింది కాదని తేలిపోగా, కుతూహలంగా విప్పి చూశాడు. అదొక ఉత్తరం.

''డియర్ ఆనంద్ ! ... ''

ఆశ్చర్యపోయాడు శివానందం. ఉత్తరాన్ని చూసి ఆశ్చర్యపోయాడంటే ఉత్తరాల ముఖం ఎరగని వాడని కాదు శివానందం. సంబోధనలోని కొత్తదనం — 'డియర్' అన్న పదమ్ ఆయన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆత్రంగా ఆసాంతం చదివేశాడు ఉత్తరాన్ని.

''డియర్ ఆనంద్ ! చివరికి నేనే తెగించి ఉత్తరం రాస్తున్నాను. మగాడివి గనుక నువ్వే ముందుగా ఆ పని చెయ్యాల్సింది. కాని, నువ్వు చెయ్యలేదు. నువ్వు ముందంటే నువ్వు ముందని యిద్దరం పంతులు వేసుకొని కూచుంటే, అమూల్యమైన కాలం వృధా అయిపోతుంది తప్ప, ఫలితం శూన్యం. అందుకనే ఆడదాన్నైనా నేనే ఆ అవకాశాన్ని తీసుకొని, మన ప్రణయ నాటకానికి నాందీ ప్రస్తావన చేస్తున్నాను. అన్యధా భావించవద్దు

ఏనాడో నా మనస్సు నీపై లగ్నమైంది. ఒక స్త్రీ తన హృదయాన్ని ఏ పరిస్థితిలో ఒక పురుషుడికి అర్పించుకొంటుంది ? — అందం చూశా ? గుణం చూశా ? డబ్బు చూశా ? హోదా చూశా ? — వీటన్నింటికీ అతీతమైన మరేదో చూశా ? — ఏమో నాకు తెలీదు. బహుశా ఏ స్త్రీ కూడా యిలాంటి ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పలేదేమో !

ఓ పవిత్ర క్షణాన, మధుర ప్రణయ భావ తరంగం నాలో వువ్వెత్తున లేచి, అందుకు కారణ భూతుడవైన నీ చుట్టూ పరిభ్రమించ సాగింది. అది మొదలుగా అనుక్షణం నిన్ను చూడాలని, నీతో మాట్లాడాలని, నీ సన్నిధిలో కాలం గడపాలనీ పరితపించిపోతున్నాను. కాని, నా మనస్సు విప్పి చెప్పే అవకాశం యింతవరకు తటస్థ పడలేదు. అనునిత్యం మనం తారసపడుతూనే వున్నా, ఏకాంతంగా సంభాషించుకోవటానికి ఒక్క క్షణం వీలు చిక్కటంలేదు. అయినా, నా కంటి చూపులు, మూగబాసలు నీ కర్థం కావటంలేదా ? అర్థ మయ్యీ బెట్టు చూపుతున్నావా ?

ఇంతకాలం చంద్రుని కోసం చకోరపక్షిలా, నీ పిలుపుకోసం ఎదురుచూస్తూ గడిపాను. ఇంక నిరీక్షించటం నావల్లకాని పని. అందుకనే ఈ లేఖ రాస్తున్నాను. వలచివచ్చిన స్త్రీ అలుసన్న

సామెతగా చెయ్యకు. నీ అంగీకారం కోసం ఎదురు తెన్నులు చూస్తూ—

నీ స్వంతం కావాలనుకొంటున్న,
— కామేశ్వరి.''

ఉత్తరం చదవటం పూర్తయింది. శివానందం ఒళ్ళంతా చిరుచెమట పట్టింది. మామూలు ఉత్తరమా అది? — ప్రేమలేఖ! తన జీవితంలో ప్రేమలేఖ అందుకోవటం యిదే మొదటిసారి. అపూర్వమైన విషయం. అపురూపమైన అనుభవం. ఆశ్చర్యం, సంతోషం, సంభ్రమం ఒక్కసారే కలిగినయ్. వాటన్నింటినీ ఒక్కసారిగా తట్టుకోవటం కష్టమైపోయింది. రక్తప్రసరణం అధికమైంది.

కళ్ళజోడు తీసి టేబుల్‌మీద పెట్టి, రుమాలుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. కొద్దిక్షణాలు విశ్రాంతి తీసుకున్న తరవాత, కళ్ళజోడు తగిలించుకొని, మరొకసారి ఉత్తరాన్ని చదివాడు — సవిమర్శకంగా.

శివానందం వయస్సు నలభై అయిదు సంవత్సరాలు. జుట్టు నెరవటం, నడుం వంగటం లాంటి వార్ధక్య లక్షణాలు లేవుగనుక, చూపులకు కాస్త చిన్నవాడిగానే కనిపిస్తాడు. పాతిక సంవత్సరాలనాడు యింటర్మీడియెట్ పాసై, గుమాస్తాగా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. తరవాత తదేక దీక్షతో శ్రమించి, ఒకటి తరవాత ఒకటిగా డిపార్టుమెంటల్ పరీక్షలు గట్టెక్కి, ఓ ఏడాది క్రితమే ఆఫీసరు కాగలిగాడు.

యౌవన ప్రారంభదశలో స్త్రీ సంబంధమైన వూహలు రావటం, ఉక్కిరిబిక్కిరి కావటం కుర్రవాళ్ళకి సహజమే. కాలేజీలో చదువుకొనే రోజుల్లో, కనిపించిన ప్రతి ఆడపిల్లనీ తన కథానాయికగా వూహించుకొని, కలలు కంటుండేవాడు శివానందం. తనకైతే ఎవ్వరూ రాయలేదుగాని, తనుమాత్రం ఎంతోమందికి ఎన్నో ప్రేమలేఖలు రాశాడు. రాయటమైతే రాశాడుగాని, పోస్టుచేసే ధైర్యం లేకపోయింది. ఒకటి రెండు సందర్భాల్లో తప్ప మిగిలినవన్నీ తనదగ్గరే అట్టేపెట్టుకొని, కొంతకాలం తరవాత చింపిపారేశాడు. పోస్టు చేయబడిన ఆ ఒకటి రెండు ప్రేమలేఖలకు కూడా సమాధానాలు రాలేదు. అంతటితో ప్రేమలేఖల పర్వం పరిసమాప్తమైపోయింది.

ఆటు తరవాత ఉద్యోగంలో చేరటం, వివాహం కావటం, పిల్లలు పుట్టటం, ప్రమోషన్లకోసం పాకులాడటం... అంతులేని జీవితపోరాటం ప్రారంభమైంది. చిల్లరమల్లర వ్యవహారాల గురించి ప్రయత్నించేంత సావకాశం లేకపోయింది. అయినా, అప్పుడప్పుడు — అందమైన అమ్మాయిలు కంటబడినప్పుడు — గత స్మృతులు — తీరని కోరికలు — అసంతృప్తి — కెలకవెయ్యటం జరుగుతూనే వుంది.

'ప్రేమ'—అనేది ఓ అద్భుతమైన అనుభవం అనీ, ఒక వరం లాంటిదనీ, ఆ అదృష్టం అందరికీ పట్టదనీ ఎప్పుడో ఎక్కడో చదివాడు శివానందం. ప్రేమించటం కన్న ప్రేమించబడటం మరో గొప్ప విషయం అని కూడా విన్నాడు.

# ప్రేమలేఖ

తను నిజంగా దురదృష్టజాతకుడే! ప్రేమించబడటం మాట దేవుడెరుగు — ప్రేమించటం అయినా సక్రమంగా జరిగి చావలేదు. శారీరకమైన అనుభవాలు లేకపోయినా, కనీసం ప్రేమలేఖల వరకు కథ నడిచి, ఆ తరవాత ఆగిపోయినా అంతగా విచారం లేకపోను. చరిత్ర ప్రసిద్ధాలైన ఎన్నో ప్రేమ కథలు మధ్యంతరంగా ఆగిపోయినవే కదా! నాయికా నాయకులు ప్రేమించుకుంటారు. పరిస్థితులో, పెద్దలో అడ్డుపడతారు. ప్రేమికులు కలుసుకోనే కలుసుకోరు. అయినా ఆ కథలన్నీ అజరామరాలై విరాజిల్లుతున్నాయి! ప్రేమ లేఖలు తను రాయటమే కాని, తనకు రాసినవారెవ్వరూ లేకపోయారు. పెళ్ళయిన తరవాత--కనీసం భార్య పార్వతి అయినా ఒక్క ప్రేమలేఖ రాసి అతని కోరిక తీర్చలేకపోయిందంటే — అది దురదృష్టం గాక మరే మవుతుంది?

పల్లెటూళ్ళో, సాంప్రదాయికమైన కుటుంబంలో పుట్టి పెరిగిన పిల్ల పార్వతి. తల్లిదండ్రులు చూసి, మెచ్చి, ముచ్చటపడి, కుదిర్చి, చేసిన పెళ్ళి తమది. పట్నవాసపు తళుకు బెళుకులు లేకపోయినా, సహజ సిద్ధమైన శరీర సౌష్టవం, తీర్చిదిద్దినట్టుండే కనుముక్కు తీరు, యౌవనపు సొంపు, పసిమిరంగు శరీర ఛాయా కలిగిన పార్వతిని చూసి, మనస్ఫూర్తిగా యిష్టపడ్డాడు తను.

బాల్యంలో కుమారీ శతకం, రుక్మిణీ కల్యాణం, గజేంద్రమోక్షం టీకా తాత్పర్య సహితంగా కంఠోపాఠం చేసిన పార్వతికి, తెలుగు భాష రాయటమూ చదవటమూ బాగా వచ్చు. భార్యా విధుల్ని చక్కగా నిర్వర్తిస్తుంది. భర్తను సంతృప్తి పరచటంలో దనకు తనే సాటి. అవసరమైతే ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతుంది. కాని, ఏం లాభం? ఉత్తరాల దగ్గర కొచ్చేటప్పటికి అసంతృప్తి తప్పనిసరైపోయింది.

పార్వతిని పుట్టింటికి పంపిన ప్రతిసారీ మరీ మరీ చెప్పి పంపేవాడు శివానందం — ఉత్తరాలు రాస్తూండమని. అంతటితో వూరుకోక, ముందుగా తనే రాసేవాడు. అట్నుంచి వెంటనే సమాధానం వచ్చేది. కాని, పార్వతి రాసేదికాదు. తండ్రితోనో, అన్నతోనో రాయించేది. అదేమిటంటే — 'నాకు సిగ్గు బాబూ!' అనేది చెక్కిళ్ళు ఎర్రబడగా. ఇంకేం చెయ్యగలడు తను? అయినా ఒకటి రెండు సార్లుతో నిరుత్సాహపడి వూరుకోక, చాలాసార్లు నయానా భయానా చెప్పిచూశాడు. ఫలితం లేకపోయింది. అన్నివిధాలా అనుకూలవతియైన భార్యను ఆ ఒక్క కారణం దృష్టిలో వుంచుకొని, కొట్టటమో, తిట్టటమో, నిందించటమో, మరేదో విధంగా శిక్షించటమో చెయ్యకుండా, క్షమించగలిగాడు తను. కాని, కనీసం భార్య నుంచైనా ప్రేమలేఖ అందుకోలేని తన దురదృష్టాన్ని నిందించుకోకుండా ఉండలేకపోయాడు.

శివానందానికి కొన్ని నియమాలున్నాయి. సర్వసాధారణంగా వాటిని అతిక్రమించటం జరగదు. ఇంటిలో భార్యను వుంచుకొని, పైపై సరదాల కోసం బయట ప్రాకులాడటం అతని దృష్టిలో క్షమించరాని నేరం. భార్యను అన్యాయం చెయ్యటం ఒకటి, నైతికంగా దిగజారిపోవటం యింకొకటి — రెండూ క్షమార్హం కానివే. పెళ్ళయిన మరుక్షణం నుంచీ తన నియమానికి కట్టుబడివున్నాడు శివానందం. మనస్సుని, వూహల్ని జయించటం మానవమాత్రుడికి సాధ్యంకాని పనిగాని, భౌతికంగా మాత్రం అతను ఏకపత్నీవ్రతుడే. పెళ్ళయి, ముగ్గురు బిడ్డల తండ్రయి, రెండు పుష్కరాల దాంపత్య జీవితం అనుభవించిన తరవాత, యిప్పుడు — ఈ క్లిష్ట సమస్య ఎదురైంది.

మరొకసారి ఉత్తరం పరిశీలించాడు శివానందం

ఉత్తరం కామేశ్వరి రాసిందే — సందేహం లేదు. మరొకరెవరన్నా రాసి నాటకమాడుతున్నా రనుకోవటానికి అవకాశం లేదు — ఈ ఫైలు ఆమె సీటుకు సంబంధించిందే గనుక!

కామేశ్వరి వయసు యిరవై పైనా — పాతిక లోపూ వుంటుంది. అంటే కాస్త అటూయిటుగా తన పెద్దకూతురి వయస్సన్నమాట! అలాంటిది నలభై అయిదు సంవత్సరాలు నిండిన తనను ప్రేమిస్తోందా లోకంలో యువకులే కరువైపోయినట్టు! ఆమె మనసులో ఏముందో ఎవరు చెప్పగలరు? ఎక్కడో చదివిన గుర్తు — పాశ్చాత్య దేశాల్లోని ఆడపిల్లలు ఈమధ్య ఎక్కువశాతం వయసుమళ్ళిన మగాళ్ళనే మోజు పడుతున్నారట! ఈమెకూడా అదే బాపతేమో!

మళ్ళీ ఒకసారి చదువుకున్నాడు శివానందం ప్రేమలేఖని.

'గోపాలరావుగారి అమ్మాయి'లో



ఒకప్పుడు ప్రేమలేఖ కోసం పరితపించి పోయాడు. ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఫలితం లేకపోయింది. భార్యవల్లకూడా ఆ కోరిక తీరక పోవటంలో పూర్తిగా నిరుత్సాహపడిపోయి, అది తీరని కోరికగానే భావించి, అంతటితో ఆ ప్రసక్తి మానుకున్నాడు. అలాంటి దివ్వాళ—అప్రయత్నంగా, అకాల వర్షాగమనంలా వచ్చిపడింది ఉత్తరం!

ఇది — ఈ ఉత్తరం — నిస్సందేహంగా ప్రేమలేఖే. కామేశ్వరి అనే యువతి, ఆనంద్ అనే — యువకుడు కాకపోవచ్చునుగాని, మగాడేగా— అతనికి రాసి పంపిన ప్రణయ సందేశం ప్రేమలేఖ కాక మరేమవుతుంది?

పదే పదే చదువుకున్నాడు శివానందం. వాక్యాలు, పదాలు ఎక్కడికక్కడ విడగొట్టి, పట్టి పట్టి చదువుకున్నాడు. శివానందం అన్న తన ముసలి పేరును నాగరీకంగా 'ఆనంద్' అని మార్చినందుకు సంతోషించాడు. వయసులోనూ, హోదాలోనూ పెద్దవాడైన తనను ఏకవచనంలో సంబోధించటాన్ని, సందర్భాన్నిబట్టి సలక్షణమేనని సమర్థించుకున్నాడు. తనలో ఏం చూసి ఆమె ప్రేమిస్తోంది? — అన్నది వూహకందని ప్రశ్నగా భావించి వదిలివేశాడు. వలచివచ్చిన స్త్రీని చులకన చెయ్యవద్దంటోంది! ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? ఆమె ఆహ్వానాన్ని అంగీకరించటమా? మానటమా?

విచిత్రమైన మానసికావస్థలో పడిపోయాడు శివానందం. ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వూహలతో, ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో చిక్కుకుపోయాడు. ఆలోచనలు పరిష్కారపథాన పయనించలేక పోతున్నాయి.

!. విజయ, జయసుధ



ఆలోచించలేక, ఆఫీసు పని చెయ్యలేక, కుర్చీలో కూర్చోలేక పైకి లేచాడు శివానందం. అంత గదీ తనొక్కడికే యిరుకైపోయినట్టు, పంకా తిరుగుతున్నా వుక్కపోస్తున్నట్టు, ఊపిరి సలపనట్టు అనిపించసాగింది.

స్ప్రింగ్ డోర్ తెరుచుకొని ముందు గదిలోకి వచ్చాడు

ఉద్యోగులంతా ఎవరి పనిలో వాళ్ళు లీనమై వున్నట్టు కనిపించారు.

శివానందం కాళ్ళు అప్రయత్నంగా కామేశ్వరి సీటువైపు నడిచినయ్. తలొంచుకొని బుద్ధిగా పనిచేసుకొంటోంది కామేశ్వరి. కొద్ది క్షణాలు పక్కనే నిలబడి, కుతూహలంగా చూశాడు శివానందం. ఏదో మాట్లాడాలనుకున్నాడు. కాని, ఏమీ మాట్లాడలేకపోయాడు. వెనక్కి తగ్గి, ఒకసారి గదంతా చుట్టివచ్చి, మళ్ళీ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ రోజంతా ఒక్క ఫైలు చూడలేదు. ఒక్క కాగితంమీద సంతకం చెయ్యలేదు. ఏదో ఆరాటం. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ప్రేమలేఖ మాత్రం పదేపదే చదువుకున్నాడు.

గడియారం అయిదు కొడుతుండగా సీటు లోంచి లేచాడు శివానందం. ప్రేమలేఖ జేబులో పెట్టుకొని యింటికి వెళ్ళటం ఎలాంటి ప్రమాదాలకు దారి తీస్తుందో వూహించలేనంత అమాయకుడు కాడతను. అలా అని బయట వుంచటమూ శ్రేయస్కరం కాదు. అందుకని ఆఫీసుకు సంబంధించిన రహస్య పత్రాలు భద్రపర్చే యినప బీరువాలో దాచాడు.

బయటికి వచ్చాడన్న మాటేగాని యింటికి పోబుద్ధికాలేదు. అస్తవ్యస్తమైన ఆలోచనలతో సతమతమైపోతూ, బజారువెంట నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఇప్పుడంటే ఆఫీసరుగాని, ఏడాది క్రితంవరకు అతను సాధారణ ఉద్యోగే. పని చేస్తున్నదేమో పైసా పైసంపాదనకు ఆస్కారంలేని నిప్పులాంటి డిపార్టుమెంటు. అదీగాక, వ్యక్తిగతంగా అతను నిజాయితీపరుడు. పైగా జీతమే జీవనాధారంగా గలవాడు. కాబట్టి, సదరు కారణాల వల్ల అతనికి వాహనయోగం లేకపోయింది. మోటరు, కారు వగైరా వాహనాల్ని తను స్వయంగా కొనుక్కోలేదు సరేసరి. కనీసం ప్రభుత్వ వాహనాన్నైనా వుపయోగించుకొనే అవకాశం అతను వెలగబెడుతున్న రెండవ తరగతి ఆఫీసర్ గిరీకి లేదు. ఎప్పుడో పాతికేళ్ళనాడు — ఉద్యోగంలో చేరిన తొలి దినాల్లో కొనుక్కున్న సైకిలు కూడా పోయినేడే పాత యినప సామానుల కొట్టులోకి వెళ్ళిపోయింది. మరోటి కొనుక్కుందాం అన్న ఆలోచన వచ్చింది గాని, గుమాస్తాలు, బంట్రోతులు జామ్మంటూ మోటర్లపైన తిరుగుతున్న ఈ రోజుల్లో, ఆఫీసరై వుండీ సైకిలు తొక్కుకోవటం నామోషీ అనిపించింది. అందుకనే ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

హోటల్లోదూరి, టిఫిన్ చేసి, కాఫీ తాగాడు. మనసు యింటివైపు పోవటం లేదు.

ఏం చెయ్యాలి?

కాలక్షేపం చెయ్యటానికి ఆ ఊళ్ళో 'బీచ్' లేదు. 'పార్కు' అని పిలవబడుతున్న ప్రదేశం ఒకటుందిగాని, అది కేవలం బిచ్చగాళ్ళకే పరిమితమై వుంది. అందుకని, సినిమాకి వెళ్ళాడు. గత్యంతరం లేక వెళ్ళాడన్న మాటేగాని, సినిమా మీద మాత్రం మనసు నిలుస్తుందా? మధ్యలోనే లేచిపోయాడు. కాస్సేపు అటూ యిటూ తిరిగి, తొమ్మిదిన్నర — పదిగంటల మధ్య యింటి తలుపు తట్టాడు.

అతని రాకకోసమే నిద్రకాచుకొని ఎదురు చూస్తున్న పార్వతమ్మ వెంటనే తలుపు తెరిచింది.

పిల్లలు ముగ్గురూ నిద్రపోతున్నారు.

భోజనం ముందు కూచున్నాడన్న మాటేగాని, అన్నం సహించలేదు. అయినా పార్వతమ్మ వూరుకోలేదు. కొసరి కొసరి వడ్డించి, బలవంతంగా నాలుగు ముద్దలు తినిపించింది.

తలెత్తి భార్య ముఖంలోకి చూడలేకపోయాడు శివానందం. ఇన్నేళ్ళ తన దాంపత్య జీవితంలోనూ భార్య ముందు తల వంచుకోవలసిన పరిస్థితి అతని కెప్పుడూ ఎదురవలేదు. కామేశ్వరి రాసిన ప్రేమలేఖ అతనిలో కలిగించిన సంచలనం యిప్పుడలాంటి పరిస్థితిని కల్పించింది.

మంచంమీద వాలాడుగాని, బుర్రను తొలిచేస్తున్న ఆలోచనలు నిద్రన్ను దరిజేరనిస్తేనా?

ఓ రాత్రి వేళ — ప్రశాంతంగా నిద్రపోతున్న భార్యని కుదిపి లేపాడు శివానందం. బద్ధకంగా కళ్ళు తెరిచి, ఏదో చెప్పబోయిన భార్యకి ఆ అవకాశమే యివ్వలేదతను. భర్త ఉద్రేకం చూసి ఆశ్చర్యపోయింది పార్వతమ్మ. పార్వతిలో కామేశ్వరిని వూహించుకొని, యిరవై ఏళ్ళు చిన్నవాడైపోయినట్టు ప్రవర్తించాడు శివానందం. అసలు కారణం తెలీని పార్వతమ్మ భర్త చేష్టలకు తృప్తిగా నవ్వుకుంది.

ఆలోచనలు యింకా ఓ నిర్ణయానికి చేరుకోక పోయినా, శివానందం ప్రవర్తన — అసంకల్పితంగానే — కామేశ్వరి వైపు మొగ్గు చూపించసాగింది.

శివానందానికి ఖరీదైన సూటు ఒకటుంది. ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప, సాధారణంగా దాన్ని బయటికి తియ్యడతను. మామూలుగా అయితే ప్యాంటు, షర్టు వేసుకొని, చెప్పులు తొడుక్కుంటాడు.

రెండో రోజు ఉదయం నున్నగా గడ్డం గీసుకొని, సూటు పైకి తీశాడు శివానందం. స్వయంగా పాలిష్ చేసి బూటు తొడుక్కున్నాడు. టై కట్టి, కోటు కూడా వేసుకొని, ప్రత్యేకంగా ముస్తాబై, కొత్త పెళ్ళికొడుకులా ఆఫీసుకు బయలుదేరాడు.

ఏదైనా మీటింగుంది కాబోలు — అనుకుంది పార్వతమ్మ.

ఎండలో నడిస్తే, చెమటపట్టి, ముస్తాబు పాడైపోతుందని, రిక్షాలో ఆఫీసు చేరుకున్నాడు శివానందం. అప్పటికే స్టాఫ్ అంతా వచ్చేసి వున్నారు. క్రీగంట కామేశ్వరిని చూసుకుంటూ వెళ్ళి తన గదిలో ప్రవేశించాడు.

ఏమైనాసరే, యివ్వాళ కామేశ్వరితో

మాట్లాడెయ్యాలనుకున్నాడు శివానందం. కాని, ఏం మాట్లాడతాడు? ఎలా మాట కలుపుతాడు? ఆఫీసుకు సంబంధించిన విషయాలైతే — నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా, అందరి సమక్షంలోనే మాట్లాడెయ్యగలడు. కాని, యిది ప్రైవేటు వ్యవహారమాయె! అదీగాక ఆమె కన్య. తను వివాహితుడు — బిడ్డల తండ్రి! పైగా యిది ప్రభుత్వ కార్యాలయం. తన వయస్సు, హోదా కూడా కొంత అడ్డువస్తాయి.

ఇంతకూ తను ఆమెతో ఏం మాట్లాడ దలుచుకున్నట్టు?—తలపట్టుకొని ఆలోచిస్తున్నాడు శివానందం.

''మే ఐ కమిన్, సార్!'' — తియ్యటి స్త్రీ కంఠం.

తలపైకెత్తిన శివానందానికి, స్ప్రింగ్ డోర్ పత్తిగించి పట్టుకు నిల్చున్న కామేశ్వరి కనిపించింది.

ఇహనేం — కాగల కార్యం గంధర్వులే తీర్చారు!

''ఎస్, కమిన్!'' అనేశాడు సంభ్రమంగా.

నెమ్మదిగా గదిలో ప్రవేశించి, టేబుల్ ముందు ఖాళీ కుర్చీల వెనక, అపరాధిలా తల వంచుకు నిలుచుంది కామేశ్వరి. ఆమెనా భంగిమలో చూస్తుంటే — శోభనం పెళ్ళికూతురు సిగ్గు పడుతున్నట్టుగా అనిపించి, ముచ్చటేసింది శివానందానికి.

పుష్టిగా ఆరోగ్యంగా నిండు యౌవనంలో మిసమిసలాడుతున్న శరీరంతో, తీర్చిదిద్దినట్టున్న అవయవాల పొందికలో, ధరించిన వస్త్రాలకే సొగసులు కూరుస్తున్న కామేశ్వరి రూపం శివానందం కళ్ళను చెదరగొట్టింది. సభ్యతమరచి, రెప్పవెయ్యకుండా ఆమెను చూస్తూ, కొద్ది క్షణాల తరవాత తేరుకొని — ''ప్లీజ్ బి సీటెడ్'' అన్నాడు గౌరవ సూచకంగా లేచినిలబడి కుర్చీ చూపిస్తూ.

మొహాన గంటుపెట్టుకొని, ఎప్పుడూ చిర్రుబుర్రులాడుతూ వుండే ఆఫీసర్ శివానందం ఈ రోజు యింత సౌమ్యంగా, గౌరవంగా, ప్రవర్తించటం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది కామేశ్వరికి. ఒక విధంగా, అదంతా తన అదృష్టంగానే భావించిందామె. కాని, ఆయన ముందు కూచోవటానికి ధైర్యం చాల్లేదు. ఎప్పుడన్నా కూచొని వుంటేగా!

''ప్లీజ్ టేక్ యువర్ సీట్!'' మళ్ళీ అభ్యర్థించాడు శివానందం.

అది ఆజ్ఞగా వినిపించింది కామేశ్వరికి. కూచోకపోతే ఆయనకి కోపం వస్తుందేమోనని నొచ్చుకున్న కూచుని, తల దించుకుంది.

ఉత్తరం అయితే ధైర్యంగా రాయగలిగింది గాని, ఎంతైనా ఆడపిల్లకదా! ఆ మాత్రం సిగ్గుండటం సహజమే—అనుకున్నాడు శివానందం.

ఆమె భయపడుతున్నదో, సిగ్గుపడుతున్నదో అర్థం చేసుకోగల స్థితిలో లేడతను.

కొంచెం తలెత్తి నెమ్మదిగా అన్నది కామేశ్వరి — ''మీతో ఓ విషయం మాట్లాడాలని వచ్చాను సార్!''

''వినటానికి నేను సిద్ధంగా వున్నాను.''

# ప్రేమలేఖ

''నిన్న నేను పంపించిన పి–1 ఫైలు...''

''...చూశాను.''

''అందులో ఒక ఉత్తరం...''

''...వుంది. చదివాను.''

''దయచేసి అది యిచ్చెయ్యండి సార్!''

''రాయటంవరకే నీ చేతుల్లో వుంది. తిరిగి యివ్వటం అనేది నా యిష్టానిష్టాలపై ఆధారపడి వుంది.''

''క్షమించండి సార్! అది మీకు రాసింది కాదు.''

షాక్ అయాడు శివానందం—''నాకు రాసింది కాదూ!''

''అవును సార్! చిన్న పొరపాటు జరిగి పోయింది.''

''పొరపాటా? మన ఆఫీసులో నేను కాక మరో ఆనంద్ ఎవరున్నారు?''

''ఈ ఆనంద్ మా బంధువుల అబ్బాయి సార్! ఈ ఊళ్ళోనే బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఈ సంబంధం కోసం మా పెద్దవాళ్ళు కూడా ప్రయత్నిస్తున్నారు.''

''మరి ఉత్తరం నాకు పంపటంలో నీ ఉద్దేశ్యం?''

త్వరలో
ప్రేమ తీర్థం
ప్రారంభం!

''పంపాలని పంపలేదు సార్! తరవాత పోస్టు చేద్దామని సొరుగులో పెట్టాను. కాగితాల్లో కలిసిపోయి, ఫైలుతో వచ్చేసినట్టుంది!''

''ఫైలుతో వచ్చేసినట్టు ఎలా తెలిసింది?''

''అక్కడంతా వెదికాను సార్! కనబడలేదు. సంతకానికి పంపించిన ఫైలు యింకా తిరిగి రాలేదు గనుక, మీరింకా చూసి వుండరని, ఒకవేళ అందులో కలిసివుంటే అడిగి తీసుకోవాలనీ వచ్చాను. ఉన్నట్టుండి మీరే చెప్పారుకదా సార్ - యింతకు ముందు.'' అమాయకంగా చెప్పుకొచ్చింది కామేశ్వరి.

''ఇదంతా నిజమేనని నమ్మమంటావా? నాతో హాస్యాలాడటం లేదు గదా!''

''ఎంతమాట సార్! మీతో హాస్యాలా? మీరు నాకు తండ్రిలాంటి వారు సార్!''

చెంపమీద ఛెళ్ళున కొట్టినట్టయింది శివానందానికి. ప్రేమలేఖ ఎక్కించిన నిషా ఒక్కసారిగా దిగిపోయింది. పెద్దకూతురు కళ్ళముందు మెదిలింది. ఎదిగిన కూతుళ్ళకు వరుల్ని వెదకవలసిన ఈ వయసులోనా తనకిలాంటి పాడుబుద్ధి పుట్టటం? అదృష్టం బావుంది గనుక ఉత్తరం తనకు రాయలేదంది కామేశ్వరి. కర్మం కాలిపోయి తనకే రాశానివుంటే — తనేం చేసేవాడు? భార్య, సంఘం, నీతి, పరువు, హోదా...అన్నింటిని కాదని ఆమె వెంటపడి వుండేవాడా? ఏమో, ఏం జరిగి వుండునో! ప్రేమలేఖ ప్రమాదకరమైనది. వివాహ బంధాన్ని పరమ పవిత్రమైనదిగా భావిస్తూ, నైతిక జీవితానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ, ఎంతో నిష్ఠగా కాలం గడుపుకొస్తున్న తననే ఓ వూపు వూపిందంటే — ప్రేమలేఖ ప్రభావం సామాన్యమైనదికోవటానికి వీల్లేదు. ఉచితానుచితాలకు సంబంధించిన తర్కవితర్కాలలో తలబద్దలు కొట్టుకొంటూ, తను కాబట్టి యింతవరకు కాలయాపన చేశాడు గాని, ఇదే మరొకడెవడైనా అయితే మరుక్షణంలోనే కార్యరంగంలోకి దూకి వుండును.

కామేశ్వరి చేసింది పొరపాటే. కాని, తను మాత్రం ఏం నిర్వాకం చేశాడు? ఒక విధంగా చూస్తే — దారి తప్పి వచ్చినా, కామేశ్వరి ప్రేమలేఖ తనకు మేలే చేసింది. తనలో నిద్రాణమై వున్న వివేకాన్ని వెన్నుతట్టి లేపి, కర్తవ్యాన్ని గుర్తు చేసింది. తన నైతిక ప్రవర్తనకు యిదొక పరీక్ష. కామేశ్వరి దయవల్ల చివరికి తనే నెగ్గాడు. అందుకు ఆమెకు ధన్యవాదాలు చెప్పుకోవాలి.

''చూడమ్మా! ప్రేమలేఖ అనేది అత్యంత ప్రమాదకరమైనది. అది వుద్దేశించబడిన వారికే చేరాలిగాని, మరొకరి చేతిలో పడకూడదు. అలా జరిగితే ఎన్నో అనర్థాలు జరిగిపోతాయి. నువ్వు రాసిన ప్రేమలేఖ అదృష్టవశాత్తు నా చేతిలో పడింది కనుక సరిపోయింది. అదే మరే కుర్రాడి చేతిలోనో పడిందనుకో — అప్పుడేం జరుగుతుందో తెలుసా! — నువ్వు నిజంగానే తనను ప్రేమిస్తున్నావన్న భ్రమలో పడిపోయి, లేనిపోని ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటాడు. నిన్నూ యిబ్బందుల్లో పడేస్తాడు. అందుకని ప్రేమలేఖలు రాయదలచిన వాళ్ళంతా ఏం చెయ్యాలంటే — ముందుగా కవరు తెచ్చుకొని, అడ్రసు రాసి తయారుగా వుంచుకోవాలి. తరవాత ఉత్తరం రాసి, కవర్లో పెట్టి, అంటించి, వెంటనే స్వహస్తాలతో పోస్టు చెయ్యాలి. ఇలాంటి విషయాల్లో మూడో వ్యక్తికి ప్రవేశం కల్పించకూడదు. అర్థమైందా?''

''అర్థమైంది సార్! ఇకముందు తప్పకుండా మీ సూచన పాటిస్తాను సార్! దయచేసి నా ఉత్తరం యిప్పించేస్తారా సార్!''

రాక రాక వచ్చిన ప్రేమలేఖ — తనది కాకపోయినా, తన చేతికి చిక్కి, తనను పరీక్షకు నిలబెట్టిన చరిత్రాత్మకమైన ప్రేమలేఖ — అడిగింది కదా అని తిరిగి ఆమె కిచ్చెయ్యటం శివానందానికి నచ్చలేదు. అందుకనే — ''ఇంకెక్కడి ఉత్తరం? నిన్ననే చింపి పారేశాను. ఇలాంటి పొరపాటేదో జరిగివుంటుందని వూహించి, దాన్ని అలాగే వుంచటం ప్రమాదకరమని భావించి, ఆ పని చేశాను. ఓ గంట పర్మిషన్ తీసుకొని, నా సూచనలు పాటించి, మరో ప్రేమలేఖ రాసుకో. వెళ్ళు. విష్ యూ గుడ్ లక్.'' అనేశాడు నేర్పుగా తన పెద్దరికాన్ని నిలబెట్టుకుంటూ.

''థాంక్యూ సార్!'' అంటూ వుషారుగ లేచింది కామేశ్వరి.